# అడ్డంకులు తొలగేనా?

- అనుమతులు ఇవ్వని అటవీశాఖాధికారులు
- నిలిచిన రహదారి పనులు
- గ్రామస్తుల అవస్థలు
- పట్టించుకోని యంత్రాంగం



అటవీశాఖ అడ్డంకులతో అర్థంతరంగా నిలిచిన వై.రామవరం- పాతకోట రోడ్డు



మార్గంలో ప్రమాదకరంగా ప్రవహించే కొండవాగు

వై.రామవరం: వై.రామవరం గ్రామం నుంచి జిల్లాలోని కొయ్యూరు మండలం మఠంభీమవరం, పోతవరం గ్రామాల మీదుగా మండల ఎగువ ప్రాంతానికి, అన్ని పంచాయతీలను కలిపే ప్రధాన రహదారిని నిర్మించాలని మండల ఎగువప్రాంత ప్రజలు కోరుతున్నారు. అటవీశాఖ అడ్డంకులతో నిలిచిపోయిన ఈ రోడ్డును మండల ఎగువ ప్రాంతమైన పాతకోట గ్రామం వరకు నిర్మాణం పూర్తి చేస్తేనే, జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణం గల వై.రామవరం మండలాభివృద్ధి సాధ్యపడుతుందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ మండలం ఎగువ, దిగువ, మధ్య అనే 3 భాగాలుగా విడిపోయి ఉంది. ఈ రహదారి పూర్తికాకపోవడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కలగా రహదారి**

కొయ్యూరు మండలం మఠంభీమవరం, పోతవరం గ్రామాల మీదుగా మండల ఎగువ ప్రాంతానికి సుమారు 25 ఏళ్ల క్రితం అటవీశాఖ అడ్డంకులతో ఈ రోడ్డు నిర్మాణం అర్థంతంగా నిలచిపోయింది. దీంతో మండల ఎగువ ప్రాంతవాసులకు ఈ రహదారి నిర్మాణం తీరని కలగా మిగిలింది. వై.రామవరం నుంచి పిల్లలపుట్ట గ్రామం వరకు సుమారు 13 కిలోమీటర్లు రోడ్డును నిర్మిస్తే మండలంలోని అన్ని పంచాయతీలకు రహదారి రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఈ రోడ్డు నిర్మాణం మండల అబివృద్ధికి అతి ముఖ్యమైనది. ప్రస్తుతం పాతకోట, గుర్తేడు నుంచి మండల కేంద్రమైన వై.రామవరం చేరుకోవాలంటే మారేడిమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల నాలుగు మండలాలు దాటుకుని సుమారు 180 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసి ఉంది. సుమారు 13 కిలోమీటర్ల దూరం ఈ రోడ్డును నిర్మిస్తే, కేవలం 30 కిలోమీటర్ల దూరంలో పాతకోట, గుర్తేడు నుంచి వై.రామవరం చేరవచ్చు. అయితే మార్గమధ్యలో ఉన్న కొయ్యూరు మండల సరిహద్దు ప్రాంతంలో ఇప్పటికే రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఇకపోతే వై.రామవరం మండలంలో సుమారు 13 కిలోమీటర్లు రోడ్డును మాత్రమే నిర్మించాల్సి ఉంది. ఈ ప్రధాన రహదారిలో ప్రవహించే అయిదు కొండవాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం రూ.3 కోట్లు నిధులు మంజూరు కాగా, ఎర్తవర్క్ చేశారు. పనులు నిర్వహిస్తుండగా అటవీ శాఖాదికారులు అడ్డుకోవడంతో పనులను అర్థంతరంగా నిలిపివేశారు. మరలా 2006 సంవత్సరంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం అదే రోడ్డుకు మరో రూ.5 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి అటవీ శాఖాధికారులు ఈ రోడ్డు కోసం సర్వేలు చేయడమే గాని ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే మండల కేంద్రానికి చేరేందుకు రవాణా ఖర్చులతో పాటు సమయభావం తగ్గుతోందని చెబుతున్నారు. అలాగే మండల ఎగువ ప్రాంతంలో పాతకోట, గుర్తేడు, దారగడ్డ, కానివాడ, బొడ్డగండి, చింతలపూడి పంచాయ తీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలోని సుమారు 100 గ్రామాలకు రహదారి, రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఈరోడ్డును నిర్మిస్తే మండలం అభివృద్ధి చెందడంతో పాటు, ఒక పక్క విశాఖ జిల్లా, మరో పక్క ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు అతి దగ్గరగా ప్రధాన మార్గం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దశాబ్దాల తరబడి అటవీశాఖ అడ్డంకులతో నిలిచిపోయిన, మండల అభివృద్ధికి అతి కీలకమైన ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయించడానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### సర్వేలతోనే సరి



దశాబ్దాల తరబడి అటవీశాఖ అధికారులు సర్వేలపై సర్వేలు చేయడమేగాని ఫలితం లేదు. మండలాభివృద్ధికి అతికీలకమైన ఈ రోడ్డు నిర్మిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. తక్షణమే అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి.

– కడబాల ఆనందరావు, రాచపాలెం, వై.రామవరం మండలం

### రాకపోకలకు అవస్థలు



ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడంలో అటవీశాఖ పూర్తిగా విఫలమైంది. మండల ఎగువ ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి రావడానికి అష్టకష్టాలు పడుతున్నారు. అటవీశాఖ నిర్లక్ష్యంతో దశాబ్దాల తరబడి ఈ రోడ్డు నిర్మాణం మండల ప్రజలకు తీరని కలగా మిగిలింది.

– ముర్ల జోగిరెడ్డి, సిరిమెట్ల, వై.రామవరం మండలం

### గంటల ప్రయాణం



పాతకోట, గుర్తేడు, దారగడ్డ, కానివాడ, బొడ్డగండి, చింతలపూడి, ప్రజలు మండల కేంద్రమైన వై.రామవరం రావాలంటే 180 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. సుమారు 13 కిలోమీటర్లు ఈ రోడ్డు నిర్మిస్తే 30 కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రమైన వై.రామవరం చేరవచ్చు. దీంతో అటవీశాఖ స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి.

– వీరమళ్ల సుబ్బలక్ష్మి, యార్లగడ్డ, వై.రామవరం మండలం

### ప్రతిపాదన పంపాం



పాతకోట రహదారి నిర్మాణానికి సర్వే తదితర పనులు పూర్తయ్యాయి. పనుల్లో భాగంగా స్టేజ్ వన్ అనుమతి కోసం నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు రాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ఈ మేరకు వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– సయ్యద్ షహెన్‌షా, అటవీశాఖ రేంజ్ అధికారి, అడ్డతీగల

## కుట్ర రాజకీయాలు తగవు



గెడ్డం నర్సింగరావు

అరకులోయ రూరల్: హిందువుల ఆత్మగౌరవాన్ని కించపరిచేందుకే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేందుకే ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి దేవస్థానం ప్రసాదంపై చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం కుట్ర పనుతుందన్నారు. రాజకీయం కోసం పవిత్ర ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేయడం, రాజకీయం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఒక్క పథకం కూడా అమలుచేయలేక ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని పథకాలు సక్రమంగా అమలు జరిగాయని గుర్తు చేశారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. తిరుపతి ప్రసాదంపై చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలపై ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

హుకుంపేట: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, చివరి చెల్లింపులు, రుణాలు మంజురు చేసి పెండింగ్‌లో ఉన్న లోన్లు, ఫైనల్ పేమేంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పీఎఫ్ , ఏపీజీఎల్ఐ సంబంధిత సొమ్ము అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకే విధ్యా విధానాన్ని అమలుచేయాలని ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక



ఎంపిక చేస్తున్న ప్రిన్సిపాల్ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ఖాళీగా ఉన్న 37 సీట్లకు సోమవారం నిర్వహించిన ప్రవేశాల్లో 73 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ప్రిన్సిపాల్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 5వ తరగతిలో–55, 7వ,తరగతిలో–4, 8వ,తరగతి–5, 9వ తరగతిలో–9 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 66 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అరకులోయ రూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలోని పారిశుధ్య, క్లాప్ కార్మికులు, కుటుంబ సభ్యులు సుమారు 66 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఆదిత్య , పావనీ, శోభారాణి, పంచాయితీ కార్యదర్శులు రాంబాబు, రాజ్‌కుమార్, ప్రకాష్, సిబ్బంది రాంబాబు, సోమేష్‌కుమార్, సింహాచలం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే (సెప్టెంబర్ 24న) పురస్కరించుకొని కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించా రు. పోటీల్లో సుమారు 48 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్టు ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి చెప్పారు. విజేతలకు మంగళవారం కళాశాలలో నిర్వహించే ఎన్ఎస్ఎస్ డేలో బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

### గర్భిణులకు పాలు, రొట్టెల పంపిణీ



కోతులగుట్ట ఆస్పత్రిలో పండ్లు, పాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కూనవరం: కోతులగుట్ట సీహెచ్‌సీలో ఓంకార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు, రోగులకు సోమవారం పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ జరిగింది. ట్రస్ట్ సభ్యులు చిచ్చడి రాజేష్ మాట్లాడుతూ ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గురుస్వామి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు, ట్రస్ట్ సభ్యులుచంద్రయ్య, మహేంద్ర, రాజు, సోమరాజు, మల్లి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీ వర్క్‌షాపులో ఎంపీడీవో నివేదిక సమర్పణ



ఢిల్లీలోని వర్క్‌షాపులో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహిస్తున్న నీతి ఆయోగ్ వర్క్‌షాపు కార్యక్రమానికి వై.రామవరం ఎంపీడీవో కె.బాపన్నదొర సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మండలానికి సంబంధించిన నీతి ఆయోగ్ గ్రామసభల వివరాలు, సర్వేలు, సమస్యలు ఇతర అంశాలపై నివేదికను ఆయన సభ్యులకు సమర్పించారు. పలు విషయాలను చర్చించారు.

## ఉధృతంగా వాగులు.. నిలిచిన రాకపోకలు



వేటుకూరు జంక్షన్ వద్ద రహదారిపై నుంచి ప్రవహిస్తున్న కొండ కాలువ

మారేడుమిల్లి: మండలంలోని గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైయింది. కొండ కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బోర్లంక వద్ద పెళ్లిరేవు వాగు సున్నంపాడు సమీపంలోని నూరుపూడి వాగు ఆకుమామిడికోట సమీపంలో రహదారిపై ఉన్న కొండ వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. వేటుకూరు జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై నుంచి కొండ కాలువ పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రమైన మారేడుమిల్లి నుంచి వేటుకూరు, పందిరిమామిడికోట, బీమవరం, బోదులూరు, ఆకుమామిడికోట, బోర్లంక పాటు వై. రామవరం మండల గుర్తేడు, పాటకోట పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న కాఫీ కార్మికులు

పాడేరు : మండలంలోని మినుములూరు ఏపీఎఫ్‌డీసీ కాఫీ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కాఫీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సుందర్‌రావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కాఫీ కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాఫీ పండ్ల సేకరణకు ముందుగానే రోజువారి కూలీ, పండ్ల సేకరణ రేట్లు ప్రకటించాలని, కార్మికులకు గ్రూప్ ఇన్సురెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఏపీఎఫ్‌డీసీ వ్యవస్థలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. పనుల్లో ప్రమాదాల బారిన పడిన కార్మికుల చికిత్స ఖర్చులను ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యమే భరించాలన్నారు.సుందర్‌కుమార్, వెంకటేష్, దేవరాజు, నాగేశ్వరరావు, కాంతారావు, బాలకృష్ణ, మోహన్, అప్పారావు, రామారావు, బాబూరావు, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పీసా సభలను విజయవంతం చేయాలి

రాజవొమ్మంగి: మండలాల వారీగా త్వరలో నిర్వహించనున్న పీసా గ్రామసభలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామసభల్లో రాజకీయ పార్టీల జోక్యం లేకుండా చూడాలన్నారు. పీసా గ్రామసభల్లో అవగాహన ఉన్న అర్హులైన వ్యక్తులనే చైర్మన్లుగా ఎన్నుకోవాలని సూచించారు. ఎన్నికల సజావుగా జరిగేలా అధికారులు చూడాలని కోరారు. ఆదివాసీ యువత ఈ పాల్గొవాలని కోరారు.

## రోడ్డు కోసం ఆందోళన



కిరాంబోలో రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కిరాంబో గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

తారురోడ్డు మంజూరు చేసి, రవాణా కష్టాలు తీర్చాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.త్రినాథ్ మాట్లాడుతూ కిరాంబో గ్రామానికి రహదారి లేక రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారని , తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు. నేతలు శంకరరావు, భీమన్న, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాతృ భాషా వలంటీర్ మృతి

ముంచంగిపుట్టు: మండలంలో గల బాబుశాల పంచాయతీ మత్స్యపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో మాతృ భాషా వలంటీర్‌గా పనిచేస్తున్న చిన్నఅప్పన్న(42) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా గుండె సంబంధింత అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బాబుశాల ఎంపీటీసీ సభ్యురాలు ఎం.పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ నేత అప్పారావులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

### ఉచిత వైద్య శిబిరం రేపు

మారేడుమిల్లి: మండలంలోని చట్టవాడ పంచాయతీలోని బోదులూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు దూడ ప్రమోదు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్ బాబ్ రెజి విక్టర్స్ జ్ఞాపకార్థం, ది లైఫ్ చర్చి (బొమ్మూరు) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో కాకినాడకు చెందిన ఏలిట్ డెంటల్ ఆస్పత్రి డాక్టర్ అడ్డాల రాజా రత్నకర్ పాల్గొని పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

## ఘనంగా వినాయకుని నిమజ్జనం



వినాయకుని ప్రతిమ నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి: వినాయకుని శోభయాత్రతో పాటు నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల కేంద్రం గూనలంకలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లారు. తరువాత నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఊరేగింపులో తప్పెటగుళ్ల, శక్తి వేషాలు, కోలాటం, నేల డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. యువత, చిన్నారులు డ్యాన్స్‌లో హోరెత్తించారు. అనంతరం విగ్రహాన్ని సమీప గెడ్డలోని నిమజ్జనం చేశారు.

## పోషకాహారంతో ఆరోగ్యం



సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీ సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని నడంపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ నెల పిల్లల ఎత్తు బరువులను విధిగా చూసి రికార్డుల్లో నమోదు చేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఆదేశించారు. పోషకాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంతాడ పంచాయతీ వైఎం.సింగదార, ఎద్దు మామిడి, గంపరాయి, దేకురాయి గ్రామాలో పోషణ వేడుకలను నిర్వహించారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



చికిత్స పొందుతున్న విద్యార్థిను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ, గిరిజన సమాఖ్య నాయకులు

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదని పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు, మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేత సల్లంగి ఉమా మాహేశ్వర రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ అన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న పెదబయలు మండలం కిముడుపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి కిల్లో రోహిత్‌ను సోమవారం పరామర్శించారు.

వారు మాట్లాడుతూ విద్యార్థి రోహిత్‌ను ఈనెల 18న ఆస్పత్రిలో చేర్చారని నేటికి సిటి స్కానింగ్ చేయలేదన్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బులు పెట్టుకొని స్కానింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందడం లేదన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం సంబంధిత అధికారులకు పట్టడం లేదని ధ్వజమెత్తారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణ ఏ మాత్రం ఉండడం లేదని ఆరోపించారు.

ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకొ నాణ్యమైన ఆహారం అందకపోవడంతో విద్యార్థులు తరచుగా ఆరోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపై ఐటీడీఏ పీవో అభిషేక్, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించాలన్నారు. నాయకులు కొండబాబు, విశ్వనాథం, యువరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జీవ సభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

అరకులోయ రూరల్: క్రైస్తవ ఉజ్జీవ సభలు విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఏపీ టూరిజం అతిథి గృహం ఆవరణలో అరకులోయ యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రెటరీ సంజీవ్‌కుమార్‌లు మాట్లాడుతూ అక్టోబర్ 1, 2 తేదీల్లో అరకులోయ జెడ్పీ అతిథి గృహం సమీప మైదానంలో జరిగే ఉజ్జీవ సభలను విజయవంతం చేయాలన్నారు. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల క్రైస్తవ దైవజనులు, విశ్వసులు విధిగా హజరు కావాలని కోరారు. పాస్టర్లు బాబూరావు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డేవిడ్, బాలరాజు తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని మాడగడ గ్రామ పంచాయతీ బి.గంగగుడ్డి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ ఎం.జ్యోతి ఆదేశాల మేరకు వార్డు మెంబర్ వంతాల డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మండ్యకేడి బాలరాజు తదితరుల సోమవారం శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2 లక్షలు 50 మీటర్లు డ్రైనేజి నిర్మాణానికి కేటాయించినట్టు వారు తెలిపారు. గత కొంత కాలంగా డ్రైనేజీ లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రహదారిపైనే నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొనేవారని, ఈ డ్రైనేజి నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పెద్దలు చందు, వంతాల రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మాలన్న

జి.మాడుగుల: గ్రామాల్లో ప్రజల పరిశుభ్రత పాటించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూపాడాలని బొయితిలి సర్పంచ్ లసంగి మాలన్న సూచించారు. బొయితిలి పంచాయతీలో సోమవారం డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల నిర్మాణాల పనులు చేపడుతున్నామన్నారు.మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.